# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 355
పేజీలు : 06 | వెల: రూ.5/-

మంగళవారం
నవంబర్ 18, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## నా భార్య, అత్త వల్లే దొరికిపోయా..

- నేను ఇలా అవ్వడానికి వారే కారణం
- నా మొదటి సంపాదన రూ.75 లక్షలు
- ఐ బొమ్మ రవి




2లో..






## ప్రద్యుమ్నకి జన్మదిన శుభాకాంక్షలు

డాక్టర్ తిరునహరి సుదాన్ష్–పరిమల గారల కుమారుడు ప్రద్యుమ్న మొదటి జన్మదిన వేడుకలు మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, నాగమణి, గడ్డం కేశవమూర్తి, ఎంఎన్.మూర్తి, ఇందిర, విజయ్, శారదాదేవి పాల్గొని ప్రద్యుమ్నకు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు జీవించాలని ఆశీర్వదించారు. - వరంగల్ వాయిస్, హనుమకొండ



6లో..

## దిష్టి బొమ్మలు నయం..!

- 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలుండీ ఏమి ప్రయోజనం
- పత్తికి మద్దతు ధరేది?
- రైతులను ఆగం చేసినందుకే విజయోత్సవాలా
- ఢిల్లీకి వెళ్లి పత్తి సమస్యలు ప్రధానికి తెలపాలి
- లేదంటే సీఎం ఇంటిముందే ధర్నా చేస్తాం
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు
- ఎనుమాముల మార్కెట్ ను సందర్శించిన బీఆర్ఎస్ నేతలు



3లో..

## నషా ముక్త్ భారత్ పేరిట 2కె రన్

- పాల్గొన్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దల్
- విద్యార్థులు, యువతచే ప్రతిజ్ఞ



# ప్రతిపక్షం ఫెయిల్

- తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోంది
- ఇప్పుడు ఆ బాధ్యతను జాగృతి పోషిస్తోంది
- కొత్త పార్టీపై ఇప్పుడప్పుడే ఆలోచన లేదు
- బీఆర్ఎస్ తో తనకెటువంటి సంబంధాలు లేవు
- రేవంత్ రెడ్డి బీసీ ద్రోహిగా మిగిలిపోతారు
- మీడియాతో కవిత సంచలన వ్యాఖ్యలు



తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయింది.. తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోంది.. దీంతో బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని ప్రకటించారు. మంగళవారం ఖమ్మంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను, తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారని మండిపడ్డారు. పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకాశం ఇవ్వలేదని.. కనీసం ఒక్క టీచర్ ను కూడా ట్రాన్స్ఫర్ చేయించుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని, కనీస గుర్తింపు ఇవ్వలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీ ద్రోహిగా మిగిలిపోతారన్నారు. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని కవిత ఆరోపించారు.

– వరంగల్ వాయిస్, ఖమ్మం

వివరాలు2లో..

2
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, నవంబర్ 18, 2025



# ప్రతిపక్షం ఫెయిల్

- తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోంది
- ఇప్పుడు ఆ బాధ్యతను జాగృతి పోషిస్తోంది
- కొత్త పార్టీపై ఇప్పుడప్పుడే ఆలోచన లేదు
- బీఆర్ఎస్ తో తనకెటువంటి సంబంధాలు లేవు
- రేవంత్ రెడ్డి బీసీ ద్రోహిగా మిగిలిపోతారు
- మీడియాతో కవిత సంచలన వ్యాఖ్యలు

**వరంగల్ వాయిస్, ఖమ్మం :** బీఆర్ఎస్ పార్టీపై, తన రాజకీయ భవిష్యత్తుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కుట్రలు, కుతంత్రాలతో బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని, దీంతో ఆ పార్టీతో తన బంధం తెగిపోయిందన్నారు. ఇప్పుడు ఆ పార్టీతో తనకెలాంటి సంబంధం లేదన్నారు. ప్రస్తుతానికి కొత్త రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తనకు, జాగృతి కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కనీస గుర్తింపు కూడా లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## పార్టీలో పట్టించుకేలే..

కొంత మంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారని కవిత ఆరోపించారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనను పెద్దగా పట్టించుకోలేదన్నారు. కనీసం ఒక టీచర్ ను బదిలీ చేయించుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని.. కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు.

## సామాజిక తెలంగాణే లక్ష్యం..

సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని కవిత ప్రకటించారు. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమన్నారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మక మైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. బిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్లు సిద్ధంగా లేరన్నారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీ ద్రోహిగా మిగిలిపోతారన్నారు. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ఒక్కొక్కరికి 250 గజాల స్థలం ఇచ్చే వరకు వారి తరఫున పోరాడుతామని స్పష్టం చేవారు.

## ఇంకా అభివృద్ధి చెందాలి..

తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదింది ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా రూపురేఖలు మారిపోయాయని గుర్తుచేశారు. ఆ తరువాత తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదన్నారు. ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణలో పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సీసీఐతో చర్చించి మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయించాలని కవిత డిమాండ్ చేశారు.






# నా భార్య, అత్త వల్లే దొరికిపోయా..

- నేను ఇలా అవ్వడానికి వారే కారణం
- నా మొదటి సంపాదన రూ.75 లక్షలు
- ఐ బొమ్మ రవి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేను ఇలా అవ్వడానికి నా భార్య, అత్తలే కారణమంటూ ఐ బొమ్మ రవి సంచలన ప్రకటన చేశారు. వాళ్ల బాధ, ఒత్తిడి తట్టుకోలేక నా వెబ్ డిజైన్ అనుభవంతో నేను ఐ బొమ్మ వెబ్ సైట్ ను ప్రారంభించానన్నారు. ఐ బొమ్మ ద్వారా సినిమా ప్రింట్లను అందులో పోస్ట్ చేసేవాడినని, 2021 సెకండ్ కోవిడ్ సమయంలో ఐ బొమ్మ వెబ్సైట్ కు విపరీతమైన ఆదరణ వచ్చిందన్నారు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ద్వారా నా మొదటి సంపాదన అక్షరాల రూ.75 లక్షలు అని చెప్పుకొచ్చారు. పోలీస్ విచారణలో ఐ బొమ్మ రవి భావోద్వేగంతో కూడిన సంచలన విషయాలు వెల్లడించారు. విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో మామూలు డిగ్రీ పట్టా పొందిన తను జీవితంలో అనేక ఒడిదుడుకులు చూశానన్నారు. మా నాన్న ఒక చిన్న బ్యాంకు ఉద్యోగిఅన్నారు. తల్లి తండ్రులు విడిపోవడంతో చెల్లి బాధ్యత తనపైనే పడిందన్నారు. గత ఏడాదే చెల్లి పెళ్లి చేసినట్లు వెల్లడించారు. వెబ్ డిజైనర్ గా కెరీర్ మొదలు తనను భార్య, అత్త అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. నా జీవితంలో పెళ్లి ఒక టర్నింగ్ పాయింట్ గా మారిందన్నారు. ప్రేమించి పెళ్లిచేసుకోవటంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. నా ప్రేమ పెళ్లికి సహకరించిన వారే నన్ను ఎందుకు పనికి రావు అని సమాజంలో అందరి ముందు అవహేళన చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయంటూ చెప్పుకొచ్చారు. వెబ్ డిజైనర్ గా మొదట్లో తనకు జీతం చాలా తక్కువ వచ్చేదని, అది కుటుంబ అవసరాలకే సరిపోయేదన్నారు. దీంతో నా భార్య, అత్త అవసరాలకు డబ్బులు ఇవ్వలేక పోయేవాడినన్నారు. దీంతో తనను వారు చులకనగా చూసేవారని, ఇతరుల ముందు లేని మాటలతో హింసించేవారన్నారు. ఎన్నో సార్లు తనను ఏడిపించారన్నారు. సమాజంలో నా పట్ల చాలా అసభ్యంగా ప్రవర్తించారన్నారు. ఆరోజు డబ్బు ఎంత ముఖ్యమో తెలుసుకున్నానన్నారు. నాకున్న అనుభవంతో ఐ బొమ్మ వెబ్ సైట్ ను ప్రారంభించి బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ద్వారా కోట్లు సంపాదించానన్నారు. ఈ రోజు నేను మీకు దొరికిపోవడానికి కూడా నా భార్య, అత్తే కారణమన్నారు. వారు నన్ను వదిలించుకోవడానికే ఇలా చేశారంటూ పోలీసులకు చెప్పినట్టు సమాచారం.




# వ్యసనపరులకు ఉచిత పునరావాస కేంద్రం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మద్యం, మత్తుపదార్థాల వ్యసనంతో కుటుంబాలు, సమాజం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వ్యసనపరులకు ఉచిత చికిత్స, కౌన్సిలింగ్, పునరావాస సేవలు అందించే కేంద్రం సేవలు ప్రారంభమయ్యాయి. ఆర్థిక, ఆరోగ్య, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి సమగ్ర వైద్యం, ఆధ్యాత్మిక–మానసిక శిక్షణ అందిస్తున్నారు. ఐఆర్ సీఏ ద్వారా మద్యపాన–మాదకద్రవ్య రోగులకు ఉచిత చికిత్స, మందులు, సేవలు లభిస్తున్నారు. నిరంతర పర్యవేక్షణతో పాటు కుటుంబాలకు సలహాలు, మార్గదర్శకత్వం కూడా ఇస్తున్నారు. యువతలో మత్తుపదార్థాల వినియోగాన్ని తగ్గించేందుకు ఓడీఐసీ ద్వారా కౌన్సిలింగ్, పునరావాసం, రిఫరల్ సేవలు అందిస్తున్నారు. సీపీఎల్ఐ కార్యక్రమం ద్వారా 8–18ఏళ్ల బాలబాలికలకు విద్య, నైపుణ్యాభివృద్ధి, నైతిక విలువలు, మానసిక చికిత్స వంటి సేవలు అందిస్తున్నారు. చెడు వ్యసనాలను నివారించి సమాజంలో గౌరవంగా జీవించేలా చేయడం ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యం. వెల్ఫేర్ అసోసియేషన్ ఫర్ యూత్ ఆధ్వర్యంలో హనుమకొండ నయీమ్‌నగర్‌లోని డీ–అడిక్షన్ సెంటర్‌లో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# సమాజ చైతన్యానికి పత్రికలు ప్రతీక

- డాక్టర్ ఆడేపు రాజేంద్ర ప్రసాద్




**వరంగల్ వాయిస్, మట్టేవాడ :** సమాజ చైతన్యానికి పత్రికలు ప్రతీక అని డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్ అన్నారు. జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా మంగళవారం వరంగల్ నగరం రామన్నపేటలోని తన నివాసంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్టులను ఆయన శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా సమస్యలు వెలికి తీసి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రయోజనాలు, జీతభత్యాలు ఉన్నా లేకున్నా మాట్లాడలేని వారి గొంతుకై సమస్యలను స్వచ్ఛందంగా సమాజానికి తెలియజేస్తూ ప్రభుత్వాలను కట్టి లేపుతూ సామాజిక సేవ రంగంతో కృషి చేస్తున్న విలేకరుల సేవలు సమాజం ఎప్పుడూ గుర్తుంచుకుంటుందని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సామల సూర్య ప్రకాష్ (వరంగల్ వాయిస్), జక్కుల విజయకుమార్ (స్టార్ 9), బొట్ల స్వామిదాస్ (నవభారత్), డాక్టర్ పాలడుగుల సురేందర్ (అక్షిత), బావండ్లపల్లి కిరణ్ కుమార్ (నవతెలంగాణ), ఆరే రమేష్ (నమస్తే తెలంగాణ), సత్యం (ఆంధ్రప్రభ) తదితరులు పాల్గొని మాట్లాడుతూ సమాజానికి అనునిత్యం సేవలందిస్తున్న విలేకరులను గుర్తుంచుకొని సత్కరించడం అభినందనీయమన్నారు. సమాజ శ్రేయస్సు కోసం జర్నలిజం నిరంతర సేవలు అందిస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, నవంబర్ 18, 2025

# నషా ముక్త్ భారత్ పేరిట 2కె రన్

- పాల్గొన్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దల్
- విద్యార్థులు, యువతచే ప్రతిజ్ఞ

**వరంగల్ వాయిస్, జనగామ :** విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దల్ జనగామ జిల్లా విభాగ్ ఆధ్వర్యంలో మంగళవారం ‘నషా ముక్త్ యువ వికసిత భారత్ అభియాన్-2 కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు, పౌరులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నెహ్రూపార్క్ నుంచి బస్టాండ్ వరకు జాతీయ జెండాలను పట్టుకొని మత్తు నిర్మూలన అవగాహన ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ధూమపానం, మద్యపానం, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలించేలా నినాదాలు చేశారు. వందాలాది సంఖ్యలో తరలివచ్చిన యువత బస్టాండ్ కూడలి వద్ద మత్తుకు వ్యతిరేకంగా తమని, తమ కుటుంబాలని, మిత్రులను, బంధువులను, సమాజాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. భజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మన దేశ అస్థిత్వానికి, అభివృద్ధికి యువతే మూలమని, వారే భవిష్యత్తులో దేశాన్ని సమాజాన్ని నడిపించేవారిని, మన దేశాన్ని అణిచివేయాలని విదేశీ సంస్థలు కుట్రపూరితంగా అనేక రూపాల్లో మత్తు పదార్థాలను విచ్చలవిడిగా విక్రయిస్తూ యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా మారుస్తున్నాయన్నారు. తద్వారా వారి జీవితాన్ని, దేశ భవిష్యత్తును నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ కుట్రలను సమర్థవంతంగా ఎదుర్కొని నషాముక్త భారత్ ని సాధిద్దామన్నారు. నిర్వాహకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవతోపాటు పట్టణ అధ్యక్షుడు అంబటి బాలరాజు, జిల్లా సహ కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, ఉల్లెంగుల రాజు, ఉపాధ్యక్షులు పాశం శ్రీశైలం, బైరునాథ్, శ్రీనివాస్ రెడ్డి, దేశు రాథోడ్, శ్రీనివాస్, ఇట్టబోయిన రాజు, రాంబాబు, మధు, వేణుగోపాల్, అరుణ్ కుమార్, రాజు, సాయి సుజీత్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో..

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ – 2025 చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, సి.ప్రభాకర్, సీవీవో బోనాల కిషన్, సీఈలు టి.సదర్ లాల్, రాజు చౌహన్, అశోక్, వెంకట రమణ, రవీంద్రనాధ్, చరణ్ దాస్, జాయింట్ సెక్రటరీ కె.రమేష్, జీఎంలు నాగ ప్రసాద్, అన్నపూర్ణ, సురేందర్, సత్యనారాయణ, కృష్ణమోహన్, శ్రీ కృష్ణ, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

### దామెరలో..

**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటి స్కూల్ & కాలేజ్ లోని స్టూడెంట్స్ కి నషా ముక్తా భారత్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా గుట్క, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల యువకులు వారి జీవితాలను నాశనం చేసుకోవద్దనే విషయంపై దామెర ఎస్సై కొంక అశోక్ అవగాహన కల్పించారు. ఇందులో సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎవరు కూడా డ్రగ్స్ కు బానిస కావద్దని, చుట్టుపక్కల వారు ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నట్లయితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచి చదువులు చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు పేరు తీసుకరావాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దామెర ఎస్సై కొంక అశోక్ తో పాటు మండల విధ్యాశాఖాధికారి రాజేష్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్, స్కూల్ ప్రిన్సిపాల్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆత్మకూరులో..

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మాదకద్రవ్యాల నిరోధించాలని తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన సంకల్పంలో భాగస్వాములవ్వాలని సెయింట్ థెరీసా పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ జాయిస్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ థెరీసా పాఠశాలలో మాదకద్రవ్యాల నిరోధానికి విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలు జీవనశైలికి దూరంగా ఉండాలని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలుదారుల పట్ల అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.








# స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు
- కాళోజి విగ్రహం ఎదుట నిరసన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తరువాతే స్థానిక ఎన్నికలకు వెళ్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు పాత రిజర్వేషన్ల ప్రకారమే గ్రామపంచాయతీ ఎన్నికలకి వెళ్లాలని తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడంతో బీసీలకు అన్యాయం జరుగుతుందని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు ఆరోపించారు. రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బుట్టి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవాకం కాళోజి విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషు మాట్లాడుతూ 42 శాతం చట్టబద్ధమైన రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వటం అంటే బీసీలను మరోసారి మోసం చేయటమే అన్నారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎదునూరి రాజమౌళి మాట్లాడుతూ చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేనప్పుడు జనాభా దామాషా ప్రకారంగా బీసీలకు 56 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ జాక్ జిల్లా కన్వీనర్ ధారబోయిన సతీష్, డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ చట్టబద్ధంగా రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికి ఇప్పుడు రిజర్వేషన్లను 23 శాతానికే పరిమితం చేయటం వలన బీసీలు 2428 గ్రామపంచాయతీలను కోల్పోతున్నారన్నారు. ఇప్పటికే భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థలలో బీసీలకు పార్టీ పరంగా 50 శాతం రిజర్వేషన్లు హామీ ఇస్తే అధికార కాంగ్రెస్ పార్టీ 42 శాతం ఇస్తామని మాట్లాడటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బీసీ నాయకురాలు పద్మజా దేవి మాట్లాడుతూ రిజర్వేషన్ల పట్ల బీఆర్ఎస్ కూడా తన వైఖరి వెల్లడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీసీ నాయకులు చిన్నాల యశ్వంత్ యాదవ్, కెడల ప్రసాద్, కృష్ణ కుమార్, సుధాకర్ ముదిరాజ్, గుండు రాజు, తిరుపతి, సనత్, రాజు యాదవ్, ఆకుల విజయ, శివ, హైమావతి, రాము, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాకు జల సంచాయ్-జన్ భాగీదారి అవార్డు



- జాతీయ స్థాయిలో విరాజిల్లిన ఓరుగల్లు ఖ్యాతి
- కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మరోసారి జాతీయ వేదికపై వరంగల్ జిల్లా ఖ్యాతి విరాజిల్లింది. వరంగల్ జిల్లాకు జల అవార్డుల్లో భాగంగా, జల సంచాయి-జన్ భాగీదారి అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం జల్ శక్తి అభియాన్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2024-2025 సంవత్సరమునకు సంబంధించి ‘జల సంచాయ్ -జన్ భాగీదారి 1.O’ అవార్డుకు దక్షిణ భారత దేశంలో జల సంరక్షణ కేటగిరి - 2 లో వరంగల్ జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది. దీంతో మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్. పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అవార్డు స్వీకరించారు. అవార్డు లభించడంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంతోషం వ్యక్తం చేశారు. అధికారుల సమష్టి కృషి, ప్రజల విలువైన భాగస్వామ్యంతో ఈ ఘనత సాధ్యమైందని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులను జిల్లాలోని ప్రజల భాగస్వామ్యంతో 42,342 ఇంకుడు గుంతలు, 8,013 సేద్యపు కుంటలు, 260 చేప పిల్లల పెంపకం కుంటలు, మట్టి కట్టలు, రాక్ పిల్ డ్యామ్ లు, కాంటూరు కందకాలు రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, బోరు బావుల పునరుద్ధరణ పనులు, ఫీడర్ కాలువలు, చెక్ డ్యామ్ లు, గ్రామాలలో బోరు బావుల వద్ద వృథాగా పోయే నీటిని భూమిలోకి ఇంకే విధంగా రీఛార్జ్ పిట్ లతో పాటు రైతుల భూములలో డ్రిప్ ఇరిగేషన్, అటవి భూములలో కందకాలు, చిన్న ఊట కుంటలు మొదలైన నీటి సంరక్షణ పనులను చేయడం జరిగిందన్నారు. ఈ నీటి సంరక్షణ పనుల వలన జిల్లాలో భూగర్భ జలాలు పెరిగాయని ఇట్టి అవార్డుతో పాటు జిల్లాకు రూ.కోటి నగదు కూడా దక్కిందన్నారు. అవార్డు రావడానికి కృషి చేసిన అధికారులకు, సహకారాన్ని అందించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డు స్వీకరించిన వారిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో పాటు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి రామిరెడ్డి ఉన్నారు.

# అభివృద్ధి పథంలో పయనించాలి

- సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలకు పిలుపు
- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలోని సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలు అభివృద్ధి పథంలో కొనసాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ఆడిటోరియంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అతిథిగా టీఎస్ కో–ఆపరేటివ్ బ్యాంక్ రాష్ట్ర ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సహకార సంఘాలు, సమాఖ్యలు కలిసికట్టుగా ఉన్నప్పుడే సహకార వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. వ్యక్తులు సహకార సంఘాలను ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా సహకార రంగంలో ఏర్పాటైన అమూల్ విజయ ప్రస్థానం గురించి కలెక్టర్ ప్రస్తావించారు. పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి అమూల్ అనేది ఎంత పెద్ద బ్రాండ్ అనేది అందరికీ తెలుసునని, వర్గీస్ కురియన్ ప్రోత్సాహంతో 250 మంది రైతులతో అమూల్ కో ఆపరేటివ్ సొసైటీ ని ఏర్పాటు చేసి ప్రారంభించారని పేర్కొన్నారు. ఈరోజు మన దేశం పాల ఉత్పత్తి ఎగుమతిలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచినట్లు తెలిపారు. సహకార సొసైటీతోనే ఈ ఘనత లభించిందన్నారు. అమూల్ వార్షిక ఆదాయం సుమారుగా 70 వేల కోట్లకు చేరిందన్నారు. సహకార సంఘాలు, మహిళా సమాఖ్యలు ఇదే విధంగా మున్ముందు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు సొసైటీలకు అందజేస్తామన్నారు. 72వ అఖిలభారత సహకార వారోత్సవ శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలియజేశారు.

ఈ సందర్భంగా మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ దేశంలో సహకార వ్యవస్థ విజయవంతంగా సాగుతుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ల ఆధ్వర్యంలో సహకార వ్యవస్థ ఆదర్శంగా సాగుతుందన్నారు. సహకార సంఘాలు, సహకార బ్యాంకులు లాభాలబాటలో పయనిస్తున్నాయని అన్నారు. రైతులు, మహిళలు, యువత, వ్యాపారులకు వరంగల్ డీసీసీబితో పాటు రాష్ట్రంలోని మరో తొమ్మిది డిసీసీ బ్యాంక్ లు రుణాలను అందించి అభివృద్ధి కి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల సీఎండి అన్నపూర్ణ, డీసీసీబీ సీఈవో వజీర్ సుల్తాన్, నాబార్డు డీజీఎం చంద్రశేఖర్, హనుమకొండ డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, ఇతర అధికారులతో పాటు వివిధ సహకార సంఘాలు, మహిళా సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు.

# లేఖన పోటీల్లో పాల్గొనండి




**□ శ్రీ సాయి విజ్ఞాన భారతి కరస్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్ రెడ్డి**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత తపాలా శాఖ థాయ్ ఆఖర్ అన్న థీమ్ పేరుతో లెటర్ టు మై రోల్ మోడల్ నా ఆదర్శ వ్యక్తికి లేఖ అనే అంశంపై నిర్వహిస్తున్న చేతిరాతలతో రాసే లేఖల పోటీలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్ రెడ్డి కోరారు. ముత్యాల్లాంటి చేతి వ్రాత విద్యార్థులకు ఒక వరం లాంటిదని ఈ ఆధునిక యుగంలో ఇంటర్నెట్లు,సెల్ ఫోన్లు వచ్చాక చేతిరాతలతో రాసే లేఖలు కరువయ్యాయి అన్నారు. దానిని దృష్టిలో ఉంచుకొని నిర్వహిస్తున్న ఈ పోటీలో 18 సంవత్సరాల లోపు పిల్లలు ఒక విభాగంగా 18 సంవత్సరాలు పైబడిన వారు రెండో విభాగంగా పోటీని నిర్వహిస్తున్నారు అన్నారు తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలలో లేఖలు పోస్టల్ శాఖ వారి ఇమ్నాన్లేటర్ ఎనవల కవర్లను మాత్రమే ఉపయోగించి రాయాలని తెలిపారు. విద్యార్థులు రాసిన లేఖలను డిసెంబర్ 8వ తేదీ లోపు థాయ్ ఆఖర్, చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ తెలంగాణ సర్కిల్ అన్న చిరునామాకు పోస్ట్ చేయాలని తెలియజేశారు. వచ్చే ఏడాది జనవరి 23వ తేదీన ఫలితాలను ప్రకటించి సర్కిల్ స్థాయిలో మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు, జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.10వేల అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు మీ దగ్గరలో ఉన్న పోస్ట్ ఆఫీస్ లో కానీ మీ ఇంటికి వచ్చే పోస్టుమాన్ ను గాని సంప్రదించాలని శశిధర్ రెడ్డి కోరారు.

# చర్లపల్లి పాఠశాలను సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు

**వరంగల్ వాయిస్, నడి కూడ :** నడికుడ మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలతోపాటు పులిగిల్ల ప్రాథమికోన్నత పాఠశాలను రాష్ట్ర పరిశీలకులు ప్రొఫెసర్ రవికాంత్ మంగళవారం సందర్శించారు. క్లీన్ అండ్ సేఫ్ స్కూల్ క్యాంపియన్ 5.0 కార్యక్రమం పాఠశాలలో జరుగుతున్న విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని రికార్డులను, తరగతి గదులను, పాఠశాల వంటగదిని, వాష్ రూమ్స్ ను,ప్లే గ్రౌండ్ను, కిచ్చిన గార్డెన్ పరిశీలించారు. ప్రొఫెసర్ రవికాంత్ వెంట హనుమకొండ జిల్లా సీఎంవో బద్దం సుదర్శన్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి కున్సోత్ హనుమంతు రావు ఉన్నారు. చర్లపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులను రాష్ట్ర పరిశీలకులు అభినందించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయులు లకావత్ దేవ, కంచరాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ, అంగన్వాడీ టీచర్ భీముడి లక్ష్మి పాల్గొన్నారు.





# బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

- అప్పుడు పెద్ద పెద్ద మాటలు..
- ఇప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్లు అంటూ ప్రచారం
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి




**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** బీసీలకు అన్యాయం చేసిన దుర్మార్గపు పార్టీ కాంగ్రెస్ పార్టీ అని శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనా చారి ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ వ్యహరిస్తున్న తీరును కోర్ట్ లు అడ్డుకుంటాయని గతంలోనే చెప్పినప్పటికీ వారు వినిపించుకోలేదని దుయ్యబట్టారు. అప్పుడు పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు పార్టీ పరంగా రిజర్వేషన్లు అంటున్నారన్నారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ ఏదని అడిగితే .. కుల గణన చేసి బీసీల జనాభా తగ్గించారని విమర్శించారు. బీసీల సర్వే లోపభూయిష్టంగా చేశారు. సర్వే తప్పుల తడక అన్నారు. అందుకే సర్వే వివరాలు బయట పెట్టలేదన్నారు. ఎన్నికల కోసమే మళ్లీ రిజర్వేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. బీసీల రిజర్వేషన్ల సాధనకు తమిళనాడును స్పూర్తిగా తీసుకుందామన్నారు. బీసీ రిజర్వేషన్ల ఆమోదం కోసం ప్రధానితోపాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర నేతలు, సంఘాలను కలుపుకొని పోరాడుదాం అని చెప్పినా పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఇప్పుడు బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుదాం అంటూ ఆయన పిలుపునిచ్చారు. నిన్న తెలంగాణ క్యాబినెట్ బీసీల రిజర్వేషన్పై పార్టీల పరంగా రిజర్వేషన్ ఇస్తామని ఎలా తీర్మానిస్తారంటూ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్కు చట్టబద్ధత వచ్చాకే ఎన్నికలకు పోవాలన్నారు. నిన్న క్యాబినేట్ లో రెండేళ్ల పాలన వారోత్సవాలు చేస్తామని ప్రకటించారని, అవి వారోత్సవాలు కాదు.. తెలంగాణ ప్రజల పీడనోత్సవాలన్నారు. తెలంగాణ సమాజంలో అన్ని వర్గాలు అన్యాయానికి గురయ్యాయన్నారు. రేవంత్ రెడ్డి వ్యవహార శైలి నవ్విపోదురుగా నాకేంటి అన్నట్టుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్, సీనియర్ నాయకులు తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీ నారాయణ, నయీమొద్దీన్, శోభన్, రవీందర్ రావు, మహేందర్, ఖలీల్, చాగంటి రమేష్, మహేష్, మహమూద్, రామ్మూర్తి, జానకి రాములు, దేవమ్మ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.




# జక్కన్న వ్యాఖ్యలపై వానరసేన మండిపాటు

ఇటీవల హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన 'వారణాసి' సినిమా టైటిల్స్ గ్లింప్స్ వేడుకలో జక్కన్న చేసిన వ్యాఖ్యలు తమ మనోభావాలను దెబ్బతీశాయని రాష్ట్రీయ వానరసేన ఎస్ఎస్ రాజమౌళిపై సరూర్ నగర్ పోలీసుకు ఫిర్యాదు ఫిర్యాదు చేశారు. ఆయన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, రాజమౌళి పై కేసు నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు. భవిష్యత్తులో ఎవరూ హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన సంఘం సభ్యులు పోలీసులను కోరారు. రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన కార్యక్రమంలో సాంకేతిక సమస్య తలెత్తింది. రాజమౌళి బాధతో పాటు అసహనానికి గురయ్యారు. స్టేజి మీద ఆయన మాట్లాడుతూ.. 'నాకు దేవుడి మీద నమ్మకం లేదు. నా తండ్రి విజయేంద్రప్రసాద్ నాతో మాట్లాడుతూ.. 'టెన్షన్ పడకు. అంతా హనుమ చూసుకుంటాడు. వెనకుండి నడిపిస్తాడు' అన్నారు. కానీ, సాంకేతిక లోపం కారణంగా ఈవెంట్ ఆగినపుడు ఇలాగేనా నడిపించేది అని కోపం వచ్చింది. నా భార్య రమాకు హనుమాన్ అంటే చాలా ఇష్టం. కానీ, ఎందుకిలా అయిందని నాకు కోపం వచ్చింది' అని అన్నారు. ఇదిలా ఉండగా మరో చిక్కులో ఇరుక్కున్నారు రాజమౌళి. హనుమంతుడిపై చేసిన వ్యాఖ్యలు వివాదం కొనసాగుతుండగా 'వారణాసి' టైటిల్ పై ఫిల్మ్‌చాంబర్‌లో మరో నిర్మాత ఫిర్యాదు చేశారు. ఈ టైటిల్ తాను ఎప్పుడో రిజిస్టర్ చేసినట్లు తెలిపారు.





# రాజశేఖర్ సరసన మరోమారు రమ్యకృష్ణ

యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్ ఈమధ్య జోరు పెంచిన విషయం తెల్సిందే. హీరోగానే కాకుండా సపోర్టింగ్ రోల్స్ లో కూడా చేయడం మొదలుపెట్టారు. ఇప్పటికే ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన రాజశేఖర్ కు అదేమీ ఆశించిన ఫలితాన్ని అందించలేదు. ఇక ప్రస్తుతం బైకర్ సినిమాలో మంచి పాత్ర చేస్తున్నాడు. ఒకపక్క సపోర్టింగ్ రోల్స్ లో నటిస్తూనే ఇంకోపక్క హీరోగా కూడా రాబోతున్నాడు.

తాజా సమాచారం ప్రకారం తమిళ్ లో సూపర్ హిట్ అయిన లబ్బరు పందు సినిమాను రీమేక్ చేస్తున్నట్లు తెలుస్తోంది. హరీష్ కళ్యాణ్, దినేష్, శ్వాసిక, సంజన కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని అందుకుంది. ఇక ఇదే సినిమా ఓటీటీలో తెలుగు వెర్షన్ లో కూడా రిలీజ్ అయ్యి ఇక్కడ కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమానే రాజశేఖర్ రీమేక్ చేస్తున్నాడు. ఇందులో దినేష్ పాత్రలో రాజశేఖర్ నటిస్తుండగా.. హరీష్ కళ్యాణ్ పాత్రలో విశ్వదేవ్ రాచకొండ నటిస్తున్నాడు. ఇక హీరోయిన్ గా రాజశేఖర్ కుమార్తె శివాని నటిస్తుంది. సినిమా మొత్తానికి హైలైట్ అంటే.. శ్వాసిక పాత్రనే అని చెప్పాలి. క్రికెట్ అంటే పిచ్చి ఉన్న భర్తను.. ఆ పిచ్చి మాన్పించి, అందరి ముందు గౌరవంగా నిలబడాలని, ప్రేమించి పెళ్లి చేసుకొని బయటకు వచ్చాకా.. తన కుటుంబానికి అల్లుడును గొప్పగా చూపించాలని ఆరాటపడే పాత్రలో ఆమె ఎంతో అద్భుతంగా నటించింది. ఆ పాత్ర ఎవరు చేస్తారు అనే డైలమా నేటితో తీరిపోయింది. రాజశేఖర్ భార్యగా శివగామి రమ్యకృష్ణను అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ పాత్రకు ఆమె పర్ఫెక్ట్ అని చెప్పొచ్చు. అంతేకాకుండా రాజశేఖర్` రమ్యకృష్ణ జోడీకి సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అల్లరి ప్రియుడు లాంటి హిట్ తరువాత వీరిద్దరి కాంబోలో దీర్ఘ సుమంగళీ భవ, బలరామ కృష్ణులు సినిమాలు వచ్చాయి. 1998 తరువాత ఈ జంట మళ్లీ కలిసి కనిపించలేదు. దాదాపు 27 ఏళ్ళ తరువాత మరోసారి ఈ జంట ఈ రీమేక్ తో కలవనున్నారు. అప్పటి కెమిస్ట్రీ ఇప్పుడు కూడా వర్క్ అవుతూ అవుతుందని అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజముంది అనేది తెలియాల్సి ఉంది.



# పట్టాలకెక్కనున్న జై హనుమాన్

తేజా సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన 'హనుమాన్' కి సీక్వెల్‌గా 'జై హనుమాన్' చిత్రాన్ని ప్రకటించారు దర్శకుడు ప్రశాంత్. ఇందులో ప్రధాన పాత్రలో కన్నడ స్టార్ నటుడు రిషబ్ శెట్టి పోషించనున్నారు. ఈ సినిమాను అనౌన్స్ చేసి చాలా కాలమే అయింది. దీనికి సంబంధించి రిషబ్ లుక్‌ను కూడా విడుదల చేశారు. కానీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. అయితే రిషబ్ బిజీగా ఉండటం, డేట్స్ కుదరక ఈ సినిమా ఇంకా సెట్స్ మీదకి వెళ్లలేదని టాక్. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రం పట్టాలెక్కేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వచ్చే ఏడాది జనవరి నుంచి రిషబ్ వరుసగా ఐదారు నెలలు ప్రశాంత్ వర్మకి కాల్షీట్స్ ఇచ్చినట్లు చిత్ర బృందం నుంచి సమాచారం అందింది. ఈ చిత్రం కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది శుభవార్తే అవుతుంది. అయితే ఈ సినిమా డిలే అవ్వడానికి దర్శకుడు ప్రశాంత్ వర్మ, □`రెమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నిరంజన్ రెడ్డితో ఉన్న విభేదాలు, ఆర్థిక లావాదేవీలు కూడా ఓ కారణమని తెలుస్తుంది. అయితే దర్శకనిర్మాతలు ఇద్దరు ఆ రచ్చను ఫిల్మ్‌ఛాంబర్‌లో పెట్టారు. వారే ఇష్యూకి సొల్యూషన్ ఇస్తారని దర్శకుడు ఇటీవల ఓ లేఖ ద్వారా తెలిపారు.



# త్వరలోనే ..పూర్తి

### దర్శకుడు హరీష్ శంకర్ కీలక ప్రకటన

గబ్బర్‌సింగ్ తర్వాత పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ , హరీశ శంకర్ కాంబోలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' కొన్ని సన్నివేశాలు మినహా ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తయింది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సాంగ్‌లో వింటేజ్ లుక్‌ను రివీల్ చేశారు. మళ్లీ ఇప్పటిదాకా సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే సినిమా నుంచి ఫస్ట్ సాంగ్ త్వరలోనే రిలీజ్ చేస్తామంటూ ఇటీవల టీమ్ చిన్న హింట్ ఇచ్చిన సంగతి తెలిసిందే! తాజాగా దర్శకుడు హరీష్ శంకర్ అధికారికంగా వెల్లడిరచారు. అల్లరి నరేష్ హీరోగా నటించిన '12ఎ రైల్వే కాలనీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హరీష్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా అప్‌డేట్ గురించి అడగ్గా... 'చిన్న కరెక్షన్... ఉస్తాద్ గురించి చిన్న న్యూస్ ఉండదు. పెద్ద న్యూస్ ఉంటుంది. డిసెంబరులో ఫస్ట్ సాంగ్ వస్తుంది. త్వరలోనే డేట్ చెబుతాం. డిసెంబర్ 31కి మీకు జోష్ వస్తుందందని చెప్పగా ఫ్యాన్స్ ఫుల్ జోష్ ఫీలయ్యారు. పవన్‌కల్యాణ్ సరసన రాశీఖన్నా, శ్రీలీల నాయికలుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవల రాశీఖన్నా కూడా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అలాగే పవన్‌కు సంబంధించిన షూట్ మొత్తం పూర్తయింది.





# దిష్టి బొమ్మలు నయం..!

- 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలుండీ ఏమి ప్రయోజనం
- పత్తికి మద్దతు ధరేది?
- రైతులను ఆగం చేసినందుకే విజయోత్సవాలా
- ఢిల్లీకి వెళ్లి పత్తి సమస్యలు ప్రధానికి తెలపాలి
- లేదంటే సీఎం ఇంటిముందే ధర్నా చేస్తాం
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు
- ఎనుమాముల మార్కెట్ ను సందర్శించిన బీఆర్ఎస్ నేతలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వకపోతే సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలస్ ను ముట్టడిస్తామని హరీశ్ రావు వార్నింగ్ ఇచ్చారు. రైతులను కాంగ్రెస్, బీజేపీలు నిలువునా ముంచుతున్నాయని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అరవైసార్లు ఢిల్లీకి వెళ్లి మూటలు ఇచ్చి వస్తున్నారు తప్ప రైతుల సమస్యలు బడేబాయ్‌కు చెప్పరా అంటూ ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టారని.. మరి రైతులకు మద్దతు ధర ఇప్పించరా అంటూ నిలదీశారు. కపాస్ యాప్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలకంటే పంటపొలాల్లో దిష్టి బొమ్మలు నయమంటూ వ్యాఖ్యానించారు. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకునేందుకు నిబంధనలు సడలించారని.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకూ 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాలు జరుపుతారా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో పత్తి రైతుకు మద్దతు ధరేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తే, కొనుగోళ్లు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయని మండిపడ్డారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మా రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, మాలోతు కవిత, నన్నపునేని నరేందర్, నాయకులు రాకేష్ రెడ్డితో కలిసి మంగళవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ను హరీశ్ రావు సందర్శించి పత్తి, మక్కల కొనుగోలును పరిశీలించారు. తొలుత మొగిలిచర్ల గ్రామంలో పత్తి రైతు సదానందం–శోభా పత్తి పంటను పరిశీలించి వారి బాధలు తెలుసుకున్నారు.

## రైతుల ఆందోళన..

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, బీజేపీ తప్పుడు విధానాలతో పత్తి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. సీసీఐ తుగ్లక్ నిర్ణయాలతో రైతులను ఇబ్బందుల గురి చేస్తోందని మండిపడ్డారు. ఎల్1, ఎల్2, ఎల్3 విధానం, కపాస్ యాప్ లో 8 నుంచి 12శాతం తేమ ఉండాలనే నిర్ణయంతో రైతులు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులన్నీ రెండు రోజులుగా మూతపడ్డాయని, పత్తి రైతులంతా అయోమయంలో ఉన్నారన్నారు. దీంతో రైతులకు పత్తిని అమ్ముకోవడానికి అవకాశం లేక దళారులకు ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం రూ.8,100 పత్తికి మద్దతు ధర ప్రకటించినప్పటికీ మార్కెట్ లో రూ. 6 వేలకు మించి కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. క్వింటాకు సుమారు రూ. 2,000 పత్తి రైతులు నష్టపోతున్నారన్నారు. మాటల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ చేతల్లో నరకం కనిపించేలా చేస్తున్నాయన్నారు. వరదలతో రైతులు తీవ్రంగా నష్టపోతే తుగ్లక్ నిర్ణయాలతో మరింత ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు.

## ఒక్క రూపాయి ఇవ్వలే..

తుఫానుతో పంటలు నష్టపోయిన రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని హరీశ్ రావు ఆరోపించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కాగా.. హరీష్ రావుతో పాటు పత్తియార్డును బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మధుసూదనాచారి, చల్లా ధర్మారెడ్డి, మాలోత్ కవిత పరిశీలించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. సమయానికి ఎరువులందవు, కరెంటు సరిగ్గా రాదు, రైతుబంధు రాదు, రుణమాఫీ లేదు, బోనస్, పంటల బీమా ఊసేలేదని మండిపడ్డారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం పత్తిని తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందన్నారు.

## దెబ్బతిన్న పంటలు..

ఒకవైపు అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిపోయింది. పంట చేనులన్నీ దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చింది. ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు అన్నారు. 8 నుంచి 12 శాతం తేమ విధానాన్ని సవరించి, కపాస్ యాప్ ని రద్దు చేయాలని సూచించారు. స్మార్ట్ ఫోన్లు లేకపోవడంతో కపాస్ యాప్‌లో నమోదు చేయడం రైతులకు కష్టమైన పనిగా మారిందన్నారు. గత సంవత్సరం లాగానే 12 క్వింటాల పత్తి కొనాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. బీజేపీ ఎంపీలు ఒక్కసారి కూడా నోరు విప్పరన్నారు. రైతుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడగరన్నారు. కేసీఆర్‌ని, బీఆర్ఎస్‌ని తిట్టడం తప్ప బీజేపీ ఎంపీలకు మరో పని చాతకాదన్నారు. కాంగ్రెస్ ప్రశ్నించదు. బీజేపీ అడగదు అంటూ హరీశ్ మండిపడ్డారు. రైతులను తీవ్రంగా ఇబ్బందులు పెట్టినందుకు విజయోత్సవాలు చేస్తున్నారా?. యూరియా బస్తాల కోసం రైతులను లైన్‌లో నిల్చోపెట్టినందుకు విజయోత్సవాలా?. అంటూ హరీశ్ ప్రశ్నించారు. వరంగల్ వరదల్లో 20 వేల ఇండ్లు మునిగిపోయాయి. సకాలంలో గేట్లు ఎత్తి ఉంటే వరంగల్ నగరం మునిగిపోయేది కాదు. మునిగిపోయిన ఇళ్లకు రూ. 15 వేలు ఇస్తామన్నారు. రెండు నెలలు అయింది ఒక్క రూపాయి ఇవ్వలేదు. వెంటనే నష్టపరిహారం విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.



# గంజాయిని కూకటివేళ్లతో పెకిలించాలి..

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- వరంగల్ ఏసీపీకి వినతి

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ నగరంలో గంజాయిని కూకటివేళ్లతో పెకిలించాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం వరంగల్ ఏసీపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ 'గంజాయి మత్తులో ఎంజాయ్ చేయొద్దన్నారు.. జీవితాన్ని నరకం చేసుకోవొద్దు' అంటూ యువతకు హితవు పలికారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. తల్లిదండ్రుల శ్రమను వృథా చేయకూడదని, ఉన్నత విద్య సాధించి జీవితంలో ఎదగాలన్నారు. గంజాయి సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా వుండాలన్నారు. వీటిని వినియోగించి తమ జీవితాలను అంధకారం చేసుకోవడంతో పాటు, ఆరోగ్య, ఆర్థికపరంగా నష్టపోవద్దని సూచించారు. యువత గంజాయికి బానిసై, మత్తులో కుటుంబ సభ్యులను కూడా గుర్తించలేనంతగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా డబ్బు సంపాదించాలనే దురాశతో యువత తప్పుడు మార్గాన్ని ఎంచుకొని, క్రిమినల్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఏసీపీ స్పందించి త్వరితగత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తనేని ధర్మారావు, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్ తదితరులు పాల్గొన్నారు.



# కాశీ విశ్వేశ్వరాలయంలో తహసీల్దార్ పూజలు

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** నగరంలోని ప్రసిద్ధిగాంచిన కాశీ విశ్వేశ్వర దేవాలయంలోని సహస్ర లింగానికి మంగళవారం వరంగల్ తహసీల్దార్ టి.శ్రీకాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వాదాన్ని ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రెవిన్యూ ఇన్ స్పెక్టర్ ఎం.కృష్ణస్వామి, లక్ష్మీపురం విలేజ్ జీపీ వేణు, భక్తులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com